సాక్షి
బాపట్ల
సోమవారం । 8 । జూలై । 2024



లక్ష్మీ గణపతి గ్రామోత్సవం

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ సూపర్ బజార్ వద్ద ఉన్న లక్ష్మీ గణపతి మందిరంలో ఆదివారం ఆషాఢ మాసం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు.



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీజగన్నాథుని రథ యాత్ర వైభవంగా నిర్వహించారు.

ప్రసన్నవదనం అలంకారంలో బండ్లమ్మ



పిట్టలవానిపాలెం: చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రసన్నవదనంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నేతి వేంకటేశ్వరస్వామి ఆదాయం రూ.4.93 లక్షలు

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు కొండపై వేంచేసిఉన్న మత్స్యావతార శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ.4.93లక్షలు ఆదాయం వచ్చినట్లు సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి తెలిపారు. మూడునెలల కాలపరిమితికి గాను హుండీ ఆదాయాన్ని ఆదివారం లెక్కించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, అర్చకుడు తెలగనేని వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కర్నాటి గురవయ్య, రుసుం కోటేశ్వరరావు, నందా గోపాలరావు, మునగా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజాంపట్నంలో అప్రెంటీస్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: బాపట్ల జిల్లా నిజాంపట్నంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఆనందబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, అహల్య నర్సింగ్ హోంలలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో 36, ఎంఎల్‌టీలో 24, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో రెండు ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న అప్రెంటీస్ మేళాలో గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మేళాలో ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.ఏడువేలు స్టైఫండ్‌గా ఇస్తారని, టెన్త్ మార్కుల జాబితా మూడు సెట్లు, ఆధార్ కార్డు, ఇంటర్ మార్కుల జాబితా, ఆరు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని తెలిపారు.

వీనులవిందుగా గోష్టి గానం




విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి శిష్యుల ఆధ్వర్యంలో శివ రామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురువర్యుల ఆరాధానోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమాలలో భాగంగా త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తలను సంగీత విద్వాంసులు మధురంగా ఆలపించారు. మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, మల్లాది కార్తిక త్రివేణి, భమిడిపాటి శ్రీలలిత, బీవీ దుర్గాభవాని, కె. మహాలక్ష్మి, ఎస్. నాగలక్ష్మి, పద్మా చక్రవర్తి, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్ గోష్టి గానంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఆరాధనా సంగీతోత్సవంలో పలువురు విద్వాంసులు పాల్గొన్నారు.

'కూచిపూడి' ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని మొవ్వ మండలం కూచిపూడిలో గల శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో కూచిపూడి నాట్యం సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన సర్టిఫికెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షకు 28 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు. ఈ పరీక్షకు పరీక్షాధికారిగా డాక్టర్ విజయ్ పాల్ లోక్‌పాత్ వ్యవహరించగా.. గాత్రంపై టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరినాథశాస్త్రి సహకరించారు.

సాగర్ నీటి మట్టం




విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 503.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 814.10 అడుగుల వద్ద ఉంది.

ఆక్వా రైతు గుండె చెరువు

- పుట్టి ముంచిన మోనోడాన్ రొయ్య సాగు
- నాసిరకం సీడ్ విక్రయిస్తున్న గుజరాత్ కంపెనీ
- తెగుళ్లతో ఎదుగుదల నిలిచిపోయిన రొయ్య
- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 15 వేల ఎకరాల్లో సాగు
- గడచిన రెండు సీజన్లలో రూ. 850 కోట్లు నష్టపోయిన రైతులు
- ప్రస్తుతం గుజరాత్ బీఎంసీ ద్వారా నాసిరకం సీడ్ విక్రయాలు
- ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేయాలంటున్న రైతులు



సాగులో ఉన్న ఆక్వా చెరువు (ఫైల్)



మోనోడాన్ రొయ్య

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఒకప్పుడు మోనోడాన్ బ్లాక్ టైగర్ ఆక్వా రైతులకు సిరులు కురిపించింది. అధిక దిగుబడులు అందించి ఆర్థిక లబ్ధి చేకూర్చింది. ఆరు నెలల్లోనే ఒక్కో రొయ్య వంద గ్రాముల దిగుబడి ఇచ్చింది. పది కౌంట్ (కిలోకు పది రొయ్యలు) అందించి సంచలనం సృష్టించింది. కిలో రూ. 1200 పైగా ధర పలికి ఆక్వా రైతులకు కాసులు కురిపించింది. దిగుబడులు పెరిగి అల్లాడుతున్న రైతులకు గిట్టుబాటు ధర లభించింది. సీడ్ ధర అన్ని రొయ్యల కంటే మూడింతలు అధికంగా ఉన్నప్పటికీ మోనోడాన్ సాగుకు మొగ్గు చూపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 15 వేల ఎకరాల్లో దీన్ని సాగుచేశారు. ఇదంతా రెండేళ్ల కిందటి మాట. ఇప్పుడు అదే మోనోడాన్ బ్లాక్ టైగర్ రకం ఆక్వా రైతుల పుట్టిముంచింది.

రైతులకు తీవ్ర నష్టం

2023 ఏడాది జనవరి సీజన్, 2024 జనవరి సీజన్‌లోనూ మోనోడాన్‌ను రైతులు సాగు చేశారు. దిగుబడుల సంగతి దేవుడెరుగు ఏకంగా పంటే పోయింది. కొత్త జబ్బులు పుట్టుకొచ్చి గత ఏడాది పంట పూర్తిగా పోయింది. ఈ ఏడాది జనవరి పంట కాలం నాలుగు నెలలు ముగుస్తున్నా, పట్టుమని పది గ్రాములు (వంద కౌంట్) కూడా రొయ్య పెరగలేదు. ఎదుగుదల పూర్తిగా నిలిచి పోయింది. నాసిరకం సీడ్‌వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నది రైతుల ఆరోపణ. మోనోడాన్ సాగుతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. ఎకరా సాగుకు సీడ్‌కు రూ. 40 వేలు, ఫీడ్, కెమికల్స్, విద్యుత్ చార్జీలు కలిపి రూ. 3 లక్షలు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన గత ఏడాది జనవరిలో రైతులు 15 వేల ఎకరాలు సాగు చేయగా రూ. 510 కోట్లు నష్టం వచ్చింది. ఈ ఏడాది జనవరిలో 10 వేల ఎకరాల్లో సాగు వల్ల రూ. 340 కోట్లు నష్టపోయారు. మొత్తంగా రెండు సీజన్లలో రూ. 850 కోట్ల నష్టం వాటిల్లింది. ఇప్పుడు సీజన్ మొదలైంది. ఈ పరిస్థితిలో ఏ పంట సాగు చేయాలో అర్థంకాక ఆక్వా రైతులు తలలు పట్టుకుంటున్నారు.

గతంలో లాభాలకు కారణాలు

గుజరాత్‌కు చెందిన వైష్ణవి హేచరీస్ కంపెనీ అమెరికన్ కంపెనీతో ఒప్పందం చేసుకొని మోనో టెక్నాలజీ(మోనోడాన్ బ్లాక్ టైగర్) సీడ్‌ను దేశ వ్యాప్తంగా సరఫరా చేస్తోంది. రెండేళ్ల కిందట వరకూ ఫసిఫిక్ మహా సముద్రం నుంచి తల్లి రొయ్యలు (60నుంచి 70 గ్రాములు)నేరుగా మన దేశానికి తెచ్చేవారు. వాటిని హేచరీస్‌లో క్రాసింగ్ చేసి, గుడ్లు పెట్టించి, పొదిగించేవారు. ఆ తర్వాత సీడ్‌గా ఒక్కోపిల్లను 99 పైసలకు రైతులకు విక్రయిస్తున్నారు. మిగిలిన రకాల రొయ్య సీడ్ మార్కెట్‌లో ఒక్కో పిల్ల 30 నుంచి 40 పైసలలోపే దొరుకుతున్నా అధిక దిగుబడి వస్తుందన్న కారణంతోనే రైతులు మోనోడాన్ వైపు మొగ్గారు. ఆశించిన మేరకు దిగుబడులు కూడా వచ్చేవి. మార్కెట్‌లో ధరలు అధికంగా ఉండి రైతులకు లాభాలు వచ్చేవి. రెండేళ్ల వరకూ ఇదే జరిగింది.

నాణ్యత కోల్పోయిన సీడ్‌తో నష్టాలు

మార్కెట్‌లో మోనోడాన్‌కు డిమాండ్ నేపథ్యంలో దాన్ని సరఫరా చేస్తున్న కంపెనీ అత్యాశకు పోయిందని, మరింతగా లాభాలు ఆర్జించేందుకు సరికొత్త వ్యాపారానికి తెరలేపిందన్నది రైతులు ఆరోపణ. సదరు కంపెనీ ఫసిపిక్ మహా సముద్రం నుంచి తల్లి రొయ్యలు నేరుగా హేచరీస్‌కు తీసుకురాకుండా గుజరాత్‌లో బీఎంసీ (బ్రీడర్ మల్టీప్లైసెంటర్) ఏర్పాటు చేసింది. ఫసిపిక్ నుంచి కేవలం 10 నుంచి 15 రోజుల వయసున్న పిల్లలు తెచ్చి వాటిని బీఎంసీలో క్రాస్ చేయిస్తోంది. గుడ్లు పెట్టించి, పిల్లలు ఉత్పత్తిచేసి వాటినే దేశవ్యాప్తంగా ఉన్న వారి సొంత హేచరీస్ ద్వారా అమ్మకానికి పెడుతోంది. నెల్లూరు, గూడూరు, ఉలవపాడు ప్రాంతాల్లో ఉన్న హేచరీస్ ద్వారా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పదివేల ఎకరాల పరిధిలోని రైతులకు సీడ్ విక్రయించింది. వాస్తవానికి ఫసిపిక్ నుంచి 70 గ్రాములున్న తల్లి రొయ్యను తీసుకురావాలంటే ఒక్కోదాని ధర రూ. 2 వేలు ఉంటుంది. అదే 10 నుంచి 15 రోజుల పిల్ల ధర కేవలం ఐదు రూపాయలలోపే ఉంటుంది. అధిక లాభాలపై దృష్టి పెట్టిన కంపెనీ కేవలం 10 రోజుల పిల్లలను ఇండియాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. గుజరాత్‌లో కంపెనీ ఏర్పాటు చేసుకున్న బీఎంసీ ఉన్న ప్రాంతంలో చుట్టూ రొయ్యలసాగు అధికంగా ఉంటుంది. దీంతో కెమికల్ పొల్యూషన్ పెరిగిపోయి సీడ్ నాణ్యంగా రావడంలేదని, దానివల్లే జబ్బులు అధికమై మోనోడాన్ దిగుబడి తగ్గిందన్నది ఆక్వా నిపుణులు, రైతుల వాదన. గతంలో లాగా ఫసిపిక్ మహాసముద్రం నుంచి తల్లి సీడ్ నేరుగా తెచ్చి హేచరీస్ ద్వారా రైతులకు అందిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు పేర్కొంటున్నారు.

పక్క రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి

గత రెండు సీజన్లుగా మోనోడాన్ సాగు చేస్తున్న రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోయారు. బాపట్ల జిల్లాలోనే కాక మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ఆక్వా నష్టాలపై చెన్నైకి చెందిన 'షీబా' శాంపిల్స్ తీసుకువెళ్లి పరిశోధనలు జరుపుతోంది. ప్రభుత్వం జోక్యం చేసుకొని బీఎంసీల నిర్వహణలో ఉన్న లోపాలను తనిఖీ చేయడంతోపాటు పరిసరాల పరిస్థితులను నిశితంగా చూడాలి. భవిష్యత్తులో నాణ్యమైన సీడ్ అందేలా చర్యలు చేపట్టడంతోపాటు నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఆక్వా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నాసిరకం సీడ్‌తో నష్టం



రైతులకు హేచరీస్ మోనోడాన్ బ్లాక్ టైగర్ పేరుతో నాసిరకం సీడ్‌ను రెండు సీజన్లోనూ సరఫరా చేశాయి. సాగుచేసి నాలుగు నెలలు అవుతున్నా ఒక్కో రొయ్య 10 నుంచి 15 గ్రాముల లోపే పెరిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీఏఏ (కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ), ఏపీ మత్స్యశాఖలు కంపెనీ నుంచి పరిహారం ఇప్పించడంతో పాటు భవిష్యత్తులో నాసిరకం సీడ్ అంటగట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– దుగ్గినేని గోపీనాథ్, రొయ్య రైతుల సంఘం ఏపీ ఆర్గనైజింగ్‌సెక్రటరీ

తీవ్రంగా నష్టపోయాం



నాలుగు నెలల కిందట ఐదు ఎకరాల్లో మోనోడాన్ రొయ్య సాగు చేశా. సీడ్‌కు రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టా. ఐదు ఎకరాల సాగుకు మరో రూ. 15లక్షలు ఖర్చు చేశా. ఇప్పటికి రొయ్య కనీసం 40 నుంచి 50 గ్రాములు పెరిగి ఉండాలి. కేవలం 16 గ్రాములు మాత్రమే ఉంది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిహారం ఇప్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

– జగన్‌మోహన్‌రెడ్డి, ఆక్వా రైతు, అనంతవరం, టంగుటూరు మండలం.

ఎదుగుదల ఆగిపోయింది



ఎనిమిది ఎకరాల్లో మోనోడాన్ బ్లాక్ టైగర్ రొయ్య సాగు చేశా. ఇప్పటికి 100 రోజులైంది.10 గ్రాములు కూడా పెరగలేదు. ఈ పాటికే 40 గ్రాములు పెరగాల్సి ఉంది. నాసిరకం సీడ్ వల్లే ఎదుగుదల లేకుండా పోయింది. కంపెనీ వారిని అడిగితే సమాధానం లేదు. దాదాపు రూ. 20 లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయాం. ప్రభుత్వం కంపెనీ వారిపై చర్యలు తీసుకొని పరిహారం ఇప్పించాలి.

– సయ్యద్ సలామ్, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు మండలం

దేశం గర్వించదగిన నాయకుడు రాజశేఖరరెడ్డి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రేపల్లె రూరల్: భారతదేశం గర్వించదగ్గ నాయకుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేదల ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసి వైఎస్సార్ పేదల మనస్సులో సుస్థిరస్థానం పొందారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా వేలాది మంది పేద విద్యార్థులకు విద్యా ప్రదాతగా నిలిచారని చెప్పారు. నేడు ఎందరో విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా వివిధ ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారంటే అది రాజన్న చలువేనని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం కలిసికట్టుగా రాష్ట్రాన్ని పాలించి ప్రతిపక్షనాయకులు సైతం శభాష్ రాజన్న అని పిలిపించుకున్న ఏకైక నాయకుడు రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. వ్యవసాయాన్ని పండుగ చేస్తూ రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన రాజన్న నేడు మన మధ్యలో లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న స్ఫూర్తితో ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాల్ని విజయవంతంగా అమలు చేశారని పేర్కొన్నారు. రాజన్న కంటే మిన్నగా ప్రజలకు అండగా నిలుస్తూ పాలన అందించిన జగనన్న నిత్యం ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటారని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కళతప్పిన తీరం

పర్యాటకులను అనుమతించని పోలీసులు



వెలవెలబోతున్న తీరం

చీరాల టౌన్: యువకుల కేరింతలు, చిన్నపిల్లలు ఆటలతో సందడిగా ఉండే తీరం నేడు నిర్మానుష్యంగా మారింది. ఆదివారం, సెలవులు వస్తే చీరాలలోని వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతం పర్యాటకుల తాకిడితో కళకళలాడేది. హైద్రాబాద్‌తో పాటుగా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి అధికంగా వచ్చేవారు. అయితే, గత నెల 24 నుంచి తీర ప్రాంతంలోకి పర్యాటకుల్ని పోలీసులు అనుమతించడం లేదు. ఇటీవల పది మందికి పైగా పర్యాటకులు సముద్ర స్నానాలకు వచ్చి మృత్యువాత పడటంతో అధికారులు బీచ్‌లను తాత్కాలికంగా మూసి వేయించారు. తీరానికి వచ్చే దారుల్లో ఆంక్షలు విధించారు.రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ శివకుమార్, సిబ్బంది గస్తీ కాస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో తీర ప్రాంతంలో 10 బీట్లు, మూడు పికెట్లు ఏర్పాటు చేశారు. తీరం ఒడ్డున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సముద్రం లోతున్న ప్రాంతంలో ఎర్ర జెండాలను ఎగురవేశారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ సీట్లకు ఆప్షన్ల నమోదు

- కళాశాలల ఎంపికకు ఈనెల 12 వరకు వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ ప్రవేశ ప్రక్రియలో కీలక సమయం ఆసన్నమైంది. ఈనెల ఒకటో తేదీన మొదలైన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్-2024) కౌన్సెలింగ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా ఎంపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఇంజినీరింగ్ కళాశాలల ఎంపికకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 12లోపు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా వెబ్ ఆధారిత ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.

నమోదు ఇలా..

సైట్‌లో పొందుపర్చనున్న కళాశాలల జాబితా నుంచి విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా తమకు నచ్చిన కళాశాలను, బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి. వెబ్ సైట్‌లోకి లాగిన్ అయిన విద్యార్థులు ఆల్ డిస్ట్రిక్స్ అని ఆప్షన్ ఎంపిక చేసుకోవడం ద్వారా వారికి రాష్ట్రంలోని అన్నిజిల్లాల వారీగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల జాబితా, వాటిల్లోని బ్రాంచ్‌లు కనిపిస్తాయి. విద్యార్థులు తాము చేరదలచుకున్న కళాశాలలకు ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి. దీని కోసం విద్యార్థులు పర్సనల్ కంప్యూటర్‌తో పాటు ప్రైవేటు నెట్ కేంద్రాలు, హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లవచ్చు. ఏఎన్‌యూతో పాటు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ల నమోదులో సహాయం అందిస్తారు.

ఈనెల 16న సీట్ల కేటాయింపు

ఈనెల 12 వరకు ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులు మార్చుకునేందుకు ఈనెల 13న చివరి అవకాశం ఉంటుంది. 16న సీట్ల కేటాయింపు జరపనుంది. ఈనెల 17 నుంచి 22 వరకు కళాశాలల్లో చేరికలతో పాటు 19న తరగతులు ప్రారంభం కానున్నాయి. గుంటూరు, నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లో 22,290 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

త్యాగం, విశ్వాసం.. మొహర్రం



రాజేసిన నిప్పల గుండం



కొండవీడు ఆషుర్‌ఖానాలో కొలువుదీరిన పీర్లు

జిల్లాలో మొహర్రం వేడుకలు ప్రారంభం

- 11 రోజులపాటు జరగనున్న ఉత్సవాలు
- ఆషుర్‌ఖానాల్లో కొలువుదీరిన పీర్లు
- చావిళ్ల వద్ద అగ్నిగుండాలు ఏర్పాటు
- తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో ఆరాధన
- 13వ తేదీన చిన్న షెరిగత్, 16న పెద్ద షెరిగత్

యడ్లపాడు: చంద్ర దర్శనంతో జిల్లాలో ఆదివారం మొహర్రం వేడుకలు ప్రారంభం అయ్యాయి. 11 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించే మొహర్రం దేశవ్యాప్తంగా జరిగే అతిపెద్ద ఉత్సవాల్లో ఒకటి. 14 శతాబ్దాల క్రితం ప్రజాస్వామ్యం.. మానవహక్కుల సాధన.. శాంతిస్థాపన.. ఇస్లాం ధర్మ పరిరక్షణ కోసం జరిగిన చారిత్రాత్మక యుద్ధాల్లో అసువులు బాసిన వీరుల సంస్మరణకు చిహ్నం మొహర్రం. 'హరం' అనే పదం నుంచి మొహర్రం వచ్చింది. ఉర్దూ భాషలో హరం అనగా త్యాగం, సమర్పణ, క్షమాపణ అని అర్థం. ఇరాక్‌లోని కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త(స) మనుమడు హజరత్ ఇమామే హుస్సేన్ ప్రాణత్యాగం చేసిన పవిత్ర దినం. ఆయా దినాలను ఎంతో పవిత్రమైనవిగా భావించి నాటినుంచి నిండుశోకంతో ఏటా 11రోజులు అంతటా సంతాప దినాలు పాటించడం పరిపాటి. దీనినే పీర్ల పండుగ అని పిలుస్తారు.

కులమతాలకతీతంగా..

ప్రాణత్యాగం చేసిన అమరుల్ని స్మరిస్తూ, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ పలు ధార్మిక కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. ముస్లింలోని సున్నీ జమాతులు దానధర్మాలు చేయడం, ఉపవాసాలు పాటించడం చేస్తుంటారు. షియా తెగకు చెందినవారైతే తమ గుండెలపై బాదుకుంటూ రక్తం చిందిస్తూ మాతం యాత్రను నిర్వహిస్తూ వారి ఆవేదనను వ్యక్తం చేస్తారు. ముస్లింలు లేని ప్రాంతాల్లో ఇతరులు సైతం మొహర్రం నిర్వహిస్తారు. కాబట్టే కులమతాలకు అతీతంగా, ఎంతో ఐకమత్యంగా జరుపుకొనే మొహరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. మొహర్రంను పల్నాడు జిల్లాలోని అన్నిప్రాంతాలతో పాటు చారిత్రక ప్రసిద్ధి చెందిన కొండవీడులో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. వందలాది టన్నుల కలపతో అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. ఊరంతా విద్యుద్దీపాలతో అలంకరిస్తారు.వీధులు, ఇళ్ల భక్తులు, బంధువులతో నిండి కొండవీడు జనకళతో శోభిల్లుతుంది.

ఇస్లాం నూతన సంవత్సరం మొహర్రంతోనే...

హిజ్రీ క్యాలెండర్ ప్రకారం మొహర్రం ఒకనెల పేరు. ఈనెలతోనే ఇస్లాం నూతన సంవత్సరం ఆరంభం అవుతుంది. ఇస్లాం మాసాల్లోని నిషిద్ధమైన, పవిత్రమైన నాలుగు మాసాల్లో మొహర్రం ఒకటి కావడం విశేషం. ఈ మాసంలో ఆషురా దినంగా పిలిచే 10వ తేదీకి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆరోజునే ధర్మయుద్ధంలో మొహమ్మద్ ప్రవక్త(స) మనుమడు హజరత్ ఇమామే హుస్సేన్ వీర మరణం పొందారు. వాస్తవానికి విషాద రోజులు కావడంతో ముస్లింలు షాహీద్ మాసంగా వ్యవహరిస్తారు. ముస్లింలు ఆషూరనాడు, ముందురోజు నఫీల్ ఉపవాసాలు ఉంటారు.

మొహర్రం ఇలా చేస్తారు

నెలవంకను చూశాకా ముజావర్లు పంజాతన్(వీరులముద్రిక)లు భద్రపరిచిన పెట్టెను బయటకు తీస్తారు. వాటిని ఆషుర్‌ఖానా (చావిళ్ల)లో ప్రతిష్టిస్తారు. మౌలా అలీ మహాత్ముని పేరిట పీర్లు నిలబెట్టి చావిళ్లలో కొలువుదీర్చుతారు. వాటికి సలాం.. ఫాతిహాఖానీ.. దివ్య ఖురాన్ గ్రంథ పఠనం గావించి.. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. పీర్ల తొలి దర్శనం కోసం భక్తులు ఎంతో ఆసక్తి చూపిస్తారు. చావిళ్ల ఎదురుగా ఆలా (అగ్నిగుండం)ను ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా హిందువులు, ముస్లింలు సమైక్యంగా ఉపవాస దీక్షల్నిబూని ప్రతిరోజు చావిళ్ల వద్దకు వెళ్లి పీర్లను వివిధ రకాలుగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. మొహర్రం ఏడో రోజైన 13వ తేదీన చిన షెరిగత్(గ్రామోత్సవం) , పదో రోజైన 16న పెద్ద షెరిగత్ ఘనంగా నిర్వహిస్తారు. పీర్ల అలంకరణకు పూలతో చేసిన షేరా(భాషికాలు), మట్టి పాత్రల్లో రంగ్ షర్బత్(పాలతో చేసిన పానకం), బెల్లంతో చేసిన మలిదా ముద్దలు తెచ్చి అగ్నిగుండం చుట్టూ తిరిగి పీర్ల చావిడిలో సమర్పిస్తారు. ఇదే రోజున ఊద్ పొగలు, అత్తరు సువాసనల మధ్య చిరాఖీ(దీపారాధన) చేస్తారు. ఆరోజు భారీగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడుతుంది. పీర్ల ఊరేగింపులో అవివాహితులైన యువకులు ఎంతో ఇష్టంగా భాగస్వాములవుతారు. విచిత్ర వేషధారణలు, వివిధ రకాల మొక్కుల్ని చెల్లించడం, భక్తులకు భోజనాల ఏర్పాటు ఉంటుంది. అర్ధరాత్రి 1.30 గంటలకు పంజతన్ పట్టుకుని హుస్సేన్, హుస్సేన్..ధూలా అని స్మరిస్తూ నిప్పుల గుండంలో తిరుగాడుతారు. మర్నాడు 17వ తేదీన పీర్లను షహదత్ (నిమజ్జనం) చేస్తారు. చివరి రోజు తమ బంధువులందరినీ ఆహ్వానించి మొహర్రం పండుగ జరుపుకొంటారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన ఈపీఎఫ్‌వో పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఈపీఎఫ్‌వో పరీక్షకు సంబంధించి 2,401 మందికి, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మందికి విజయవాడలో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్‌వో, పర్సనల్ అసిస్టెంట్ పరీక్షలు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్ష జరిగింది. ఈపీఎఫ్‌వో పరీక్షకు 21.91 శాతం మంది, ఈఎస్ఐసీ పరీక్షకు 75 శాతం మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు సూపర్‌వైజర్లు, సహాయ సూపర్ వైజర్లు, రూట్ కమ్ లైజనింగ్ అధికారులు తదితరులు సమర్థంగా పనిచేశారు. పరీక్షల నిర్వహణలో రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఆర్టీసీ తదితర విభాగాల అధికారులు భాగస్వాములయ్యారు.



పరిశీలించిన కలెక్టర్

నగరంలో పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సృజన ఆదివారం పరిశీలించారు. నగరంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలో జరిగిన పరీక్ష తీరును పరిశీలించి, అభ్యర్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా

ఆధిక్యంలో కర్నూలు జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర క్రికెట్ పోటీల్లో భాగంగా కర్నూలు, శ్రీకాకుళం జిల్లా జరుగుతున్న మ్యాచ్‌లో కర్నూలు జట్టు భారీస్కోర్ దిశగా కొనసాగుతోంది. కర్నూలు జట్టు శనివారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 9 వికెట్ల నష్టానికి 343 పరుగులను ఆదివారం తన తొలి ఇన్నింగ్స్‌గా డిక్లేర్ చేసింది. దీంతో మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 196 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని భానుప్రకాష్ 39 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లు బి.మహిత్ 4, కె.సాయి విఘ్నేష్ 3 వికెట్లు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవరోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 30 పరుగులు సాధించి 177 పరుగుల ఆధిక్యంలో ఉంది. సోమవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

గురజాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తపై తెలుగుదేశం కార్యకర్త ఆదివారం సాయంత్రం రాయితో దాడి చేసి గాయపరచిన ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని గోగులపాడు గ్రామానికి చెందిన మల్లా వెంకట చలమయ్య పొలం నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తోటకూర సైదారెడ్డి కనిపించడంతో పలకరించాడు. ఈ నేపథ్యంలో సైదారెడ్డి 'అధికారం మాది నువ్వు నన్ను తిడతావా' అంటూ రాయి తీసుకుని తలపై గట్టిగా కొట్టాడు. దీంతో వెంకట చలమయ్య తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు తలకు ఏడుకుట్లు వేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ పథకాల పేర్లు మార్పు

కొరిటిపాడు(గుంటూరు): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాల పేర్లను మార్పు చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ–క్రాప్‌ను ఈ–పంట, వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ సమ్మాన్ పథకాన్ని అన్నదాత సుఖీభవ, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకాన్ని వడ్డీలేని రుణాలు, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), వైఎస్సార్ యంత్ర సేవ పథకాన్ని ఫామ్ మెకనైజేషన్ స్కీమ్, డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లు, వైఎస్సార్ యంత్రసేవ కేంద్రాలను విలేజ్/క్లస్టర్ సీహెచ్‌సీలు, వైఎస్సార్ యాప్‌ను వీఏఏ పర్ఫార్మెన్స్ మానిటరింగ్ యాప్‌గా పేర్లు మార్పు చేసింది.

ప్రముఖ రచయిత నాగసూరికి పురస్కారం


నాగసూరి దంపతులకు పురస్కారం అందిస్తున్న పుట్టంరాజు దంపతులు

అద్దంకి: స్థానిక శ్రీనివాసా ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ సాహితీ పురస్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ రచయిత నాగసూరి వేణుగోపాల్ పురస్కారాన్ని అందుకున్నారు. సభకు పద్యకవి డి.వి.ఎం. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నంబూరి బాలభార్గవి ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభికులకు లక్కరాజు శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. పురస్కార గ్రహీత పరిచయాన్ని నంబూరి హనుమంతరావు నిర్వహించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పాన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి, నిత్య చైతన్యానికి చిరునామా అని కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ విజ్ఞాన సర్వస్వం నాగసూరి వేణుగోపాల్ అని పేర్కొన్నారు. డాక్టర్ యు.దేవపాలన మాట్లాడుతూ నాగసూరి 80కి పైగా పుస్తకాలను రాయడంతోపాటు, రెండు పదుల సంఖ్యలో పుస్తకాలకు పైగా సంపాదకత్వం వహించారని గుర్తు చేశారు. అనంతరం నాగసూరి వేణుగోపాల్ దంపతులను పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ తరపున శ్రీరామచంద్రమూర్తి, శైలజ సాహిత్య పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగసూరి హనుమత్ ప్రసాద్, నాగసూరి వెంకట సుబ్బారావు, నాగసూరి శివప్రసాద్, చుండూరి మురళీ సుధాకరరావు, వామరాజు వెంకటేశ్వరరావు, చిన్ని మురళీకృష్ణ, మంచా సుబ్బారావు, కారుమంచి రమణ, కూరపాటి రామకోటేశ్వరరావు, గాడేపల్లి దివాకరదత్తు, అన్నంనేని వెంకట్రావు, ఆర్.వి. రాఘవరావు, పాన్నూరి శ్రీనివాసులు, జి.హరనాథ్‌బాబు, నిమ్మరాజు నాగేశ్వరరావు, ధేనువకొండ సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

నార్నెపాడు శాసనాన్ని కాపాడుకోవాలి

- 12వ శతాబ్దానికి చెందిందిగా గుర్తింపు
- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి


శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాస్త్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడులోని భీమేశ్వరాలయం బయట పడి ఉన్న క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన శాసనాన్ని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి(సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలోని భీమేశ్వరాలయం పరిసరాలను ఆదివారం పరిశీలించామన్నారు. ఆలయం ఆవరణలో ఉండే 12వ శతాబ్దానికి చెందిన ఎంతో విలువైన ఈ శాసన రాయిని ఆలయ పునర్నిర్మాణ సమయంలో రోడ్డుపై పడేశారని పేర్కొన్నారు. శాసన రాయిపై క్రీస్తు శకం 1151 నాటివి రెండు, క్రీస్తు శకం 1198 నాటి ఒకటి, క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన రెండు, క్రీస్తు శకం 1266 నాటివి ఒకటి కలిపి మొత్తం ఆరు శాసనాలున్నాయని శివనాగిరెడ్డి వివరించారు. ఈ శాసనాల్లో సోమేశ్వరాలయంలోని కేశవస్వామి అఖండ దీపాలకు దానం చేసిన వారి వివరాలు, ఆలయం ఆవరణలో నంది విగ్రహాలను ప్రతిష్ఠించిన వారి వివరాలు, చెరువును తవ్వించని వివరాలు ఉన్నాయని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ శాసనాల చారిత్రక విలువపై ఆ గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. సుమారు 800 ఏళ్ల నాటి ఈ శాసనాలను ఆలయ ఆవరణలోనే ప్రత్యేకంగా పీఠం ఏర్పాటు చేసి వాటిల్లోని వివరాలు అందరికీ తెలిసేలా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. మణిమేల శివశంకర్, స్వర్ణ చినరామిరెడ్డి తనకు సహకరించారని శివనాగిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన నిర్వాహకులు

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్–తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాయంత్రం ఆరు గంటలకు ప్రదర్శనలు ప్రారంభం కానున్నట్టు నిర్వాహకులు ఈదర వెంకట పూర్ణచంద్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. తొలిరోజు సాయంత్రం ఇంద్రప్రస్థం, స్వప్నం రాల్చిన అమృతం, అందిన ఆకాశం నాటికలు ఉంటాయని, మధ్యలో రోటరీలో ఉత్తమ సేవలు అందించిన అన్నే రత్నప్రభాకర్‌కు వ్యవస్థాపకుడు పాల్ హారీస్ పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. రెండోరోజైన 9వ తేదీ సాయంత్రం కపిరాజు, నాన్నా నేను వచ్చేస్తా నాటికల ప్రదర్శన, అనంతరం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. తొలిరోజున మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రెండోరోజున మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు, నన్నపనేని రాజకుమారి పాల్గొంటారని తెలిపారు. వీరితో ఈదర శ్రీనివాసరావు, పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వర్లు, డి.మురళీకృష్ణ, అరవపల్లి శ్రీకాంత్, కాకుమాను ఉపేంద్ర, జాన్ కీట్స్, ఆలపాటి కిరణ్ ఉన్నారు.

నేడు డాక్టర్ వైఎస్సార్ జయంత్యుత్సవం

తాడేపల్లి రూరల్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పేదల పెన్నిధి, ఆరోగ్యశ్రీ ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని జయప్రదం చేయాలని వారు కోరారు.

అత్తింటి ముందు కోడలు నిరసన

- ఇటీవల మృతి చెందిన భర్త
- కవల ఆడపిల్లలు పుట్టారని ఇంట్లోకి రానివ్వని అత్తామామలు
- చీరాల మండలం కొత్తపాలెంలో ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు


అత్తింటి ముందు బైఠాయించిన కుసుమాంజలి

చీరాల రూరల్: కాన్పులో కవల ఆడపిల్లలకు జన్మనిచ్చిందని అత్తామామ ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుపడటంతో చంటి పిల్లలతో రోడ్డుపైనే నిరసన తెలిపింది ఓ బాలింత . ఈ ఘటన చీరాల మండలం కొత్తపాలెంలో ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. చీరాల మండలం కొత్తపాలేనికి చెందిన శివ సుందరరెడ్డి, నాంచారమ్మ దంపతులు కుమారుడు మణికంఠరెడ్డికి అదే ప్రాంతానికి చెందిన కుసుమాంజలితో 2021లో వివాహం జరిగింది. అయితే, తొలి కాన్పులో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ నేపథ్యంలో కుసుమాంజలి భర్త మణికంఠరెడ్డి 20 రోజుల కిందట పొలంలో పని చేస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. ఆ సమయానికే గర్భంతో ఉన్న కుసుమాంజలి వారం రోజుల కిందట రెండో కాన్పులో కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. అయితే, ముగ్గురు ఆడపిల్లలు ఉండటం ఇష్టం లేని అత్తామామ తనను ఇంటిలోకి రానివ్వడం లేదని ఆరోపిస్తూ కుసుమాంజలి అత్త ఇంటి ముందు కుటుంబ సభ్యులతో బైఠాయించి నిరసన తెలియజేసింది. అనంతరం తనకు న్యాయం చేయాలంటూ పోలీసుల్ని ఆశ్రయించింది. ఓ వైపు భర్తను కోల్పోయిన కుసుమాంజలి పుట్టెడు దుఃఖంలో ఉండగా మరో వైపు ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని, ఇంటిలోకి రానివ్వకపోవడం బాధాకరమని స్థానికులు సైతం అత్తామామల తీరుపై మండిపడుతున్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ ప్రశ్నార్థకం

- మంత్రి నిమ్మల ప్రకటనే దీనికి నిదర్శనం
- రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు ఆందోళన



తెనాలి: కృష్ణా డెల్టాలో ఈ ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం కానుందని, అందుకు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు చేసిన ప్రకటనే నిదర్శనమని రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. కృష్ణా బ్యారేజీ, పులిచింతలలో నిల్వలు తక్కువగా ఉన్నందున ఆగస్టు వరకు కృష్ణాడెల్టాకు సాగునీరు ఇవ్వలేమని మంత్రి పత్రికాముఖంగా తెగేసి చెప్పారని, ఇది నీరు విడుదల చేసే వరకు సేద్యం ఆపాలని పరోక్షంగా రైతాంగానికి సూచించినట్టుగా ఉందని విమర్శించారు. నదుల్లో నీటి నిల్వలు తక్కువ ఉన్నప్పుడు సాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని, మంచినీటి బడా వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున నదుల నీటిని వాడుకుంటున్నాయని, దీనిని వెంటనే అరికడితే సాగుకు నీరివ్వడం కష్టం కాబోదని వివరించారు. వ్యాపార సంస్థలకు, చేపల చెరువులకు నీటి వినియోగంపై ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న నీటికన్నా తక్కువ నిల్వలు ఉన్నప్పుడే ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీరు విడుదల చేశారని గుర్తుచేశారు.

పర్యావరణ పరిరక్షణలో వృక్షాల పాత్ర కీలకం


మొక్క నాటి నీరు పోస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో వృక్షాల కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నాజ్ సెంటర్లోని సెయింట్ జోసఫ్ బీఈడీ కళాశాలలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్, గైడ్ విద్యార్థులు మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. స్వరూపరాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ, పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సందర్భాల్లో మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ రోజలీన్ మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కల పెంపకం, సంరక్షణ అవసరమన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ఈనెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా కార్యదర్శి ఎం. ఏడుకొండలు, జిల్లా సహాయ కార్యదర్శి ఇ. అనిల్, ఏఎస్‌వోసీ నజీర్, డీవోసీ శ్రీహరి, నరేష్, గోపి, స్కౌట్ ఉపాధ్యాయులు ప్రతాపరెడ్డి, సుబ్బారెడ్డి, జి. కిరణ్, మీరావలి, అర్జున్, వరకమలాదేవి, రుద్రమదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయండి

మంత్రి కొల్లు రవీంద్రకు విన్నవించిన అసోసియేషన్ నాయకులు


మంత్రి రవీంద్రకు వినతి అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు బిరుదు రవిబాబు

ఏఎన్‌యూ : రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ 2018లో నిర్వహించిన పరీక్ష అర్హత సాధించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని టెస్ట్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలలో 1100 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి 2018లో పరీక్ష నిర్వహించగా 40 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని వారిలో 3500 మంది అర్హత సాధించారని వారు మంత్రికి తెలిపారు. అనంతరం ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించగా అప్పట్లో కొందరు హైకోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని, కేసులు క్లియర్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఇప్పటి వరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులు, అధికారులను కోరామని అయినా ఫలితం లేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కేసులు క్లియర్ చేయించి ఉద్యోగాలు భర్తీ చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందిస్తూ ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి దృష్టికి మీ వినతిని తీసుకెళతానని హామీ ఇచ్చారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ క్యాండిడేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిరుదు రవిబాబు తదితరులు ఉన్నారు.

చిత్తూరుపై విశాఖ జట్టు ఘన విజయం


85 పరుగులు సాధించిన విశాఖ జట్టు బ్యాట్స్‌మ్యాన్ కె భాను శ్రీ హర్ష


5 వికెట్లుతో విశాఖ బౌలర్ కే శ్యామ్ దినేష్


5 వికెట్లు తీసిన చిత్తూరు జట్టు బౌలర్ ప్రకాష్ ముత్యాల

మంగళగిరి: అన్ని విభాగాలలో ఆధిక్యం కనబరిచిన విశాఖపట్నం జట్టు చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. నవులూరు అమరావతి టౌన్ షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్ –16 మెన్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలలో ఆదివారం విశాఖపట్నం, చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ రెండో రోజు కొనసాగింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టిన విశాఖపట్నం జట్టు 88.5 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. కె.భాను శ్రీహర్ష 1 సిక్స్ 16 ఫోర్లతో 85 పరుగులు చేయగా, జి.బి.జస్వంత్ 6 ఫోర్లతో 75 పరుగులు, కె.గౌతమ్ 6 ఫోర్లతో 54 పరుగులతో రాణించారు. చిత్తూరు జట్టు బౌలర్ 23.5 ఓవర్లు బౌలింగ్ చేసి 57 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు 38.4 ఓవర్లలో 120 పరుగులకే ఆలౌటైంది. జట్టు బ్యాట్స్‌మెన్ షోహన్ రెడ్డి 3 ఫోర్లతో 26 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్ పి.శ్యామ్ దినేష్ 10 ఓవర్లలో 39 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసి రాణించాడు. చివరకు విశాఖపట్నం జట్టు చిత్తూరు జట్టుపై 104 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

తీరంలో సొంత ఖర్చులతోనే భద్రత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు, రిసార్ట్స్ యజమానులు

రిసార్ట్స్ యజమానులు

చీరాల: వాడరేవు నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు ఉన్న తీర ప్రాంతంలో ప్రమాదవశాత్తు పలువురు యువకులు మృత్యువాత పడ్డారని.. దీంతో సొంత నిధులతో భద్రత చర్యలు చేపట్టామని రిసార్ట్స్ యజమానులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. తమను పోలీసులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయలేదన్నారు. డబ్బులు డిమాండ్ చేసినట్లుగా జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. తామే రూ.10 లక్షలతో గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను, చెక్‌పోస్టులను ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పారు. తీర ప్రాంతానికి పర్యాటకులు రాక రిసార్ట్స్‌ను మూసి వేశామని వెల్లడించారు. సమావేశంలో పలువురు రిసార్ట్స్ యజమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే వ్యక్తి కొండయ్య

చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే వ్యక్తి అని నమ్మి ప్రజలు ఓట్లు వేశారని పలువురు బీసీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గొల్లపాలెంలోని యాదవ కమిటీ హాలులో విలేకరులతో మాట్లాడారు. నిస్వార్థ రాజకీయ నాయకుడిగా, విద్యా, వ్యాపారవేత్తగా పేరొందిన ఎం.ఎం. కొండయ్య అవినీతికి పాల్పడుతున్నాడని పేర్కొనడం సరికాదని తెలిపారు. ఆయనపై తప్పుడు ప్రచారాలు చేయడం దారుణమని ఖండించారు. ఎటువంటి వివాదాలకు వెళ్లే వ్యక్తి కాదని, అవినీతిని అంటకడుతూ ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తాడిబోయిన లక్ష్మీప్రసాద్, బత్తుల అమిత్, పులి వెంకటరావు, చిమటా నారాయణస్వామి, పులి హరికృష్ణ, ఊట్ల పవన్, యర్రాకుల శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కార్మెల్ మాత జెండా ప్రతిష్ట


జెండాను ఊరేగిస్తున్న భక్తులు


కొండపై జెండా ప్రతిష్టిస్తున్న విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై వెలసిన కార్మెల్ మాత మహోత్సవాలు ఈనెల 14, 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్టు బాలఏసు దేవాలయ విచారణ గురువులు ఫాతిమామర్రెడ్డి చెప్పారు. బాల ఏసు ఆలయంలో ఆదివారం ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వద్ద జెండాలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వాక్యోపదేశం చేశారు. అనంతరం ఉత్సవాల గురించి వివరించారు. 11వతేదీ సాయంత్రం బాల ఏసుదేవాలయంలో దివ్యపూజాబలిని ఫాదర్ ఎస్.చంద్రమోహన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. 12న సాయంత్రం ఫాదర్ పి.చిన్నయ్య, 13న సీహెచ్ జోసఫ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యపూజాబలి నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం ఫాదర్, ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ ప్రవీణ్‌కుమార్, ఫాదర్ వి. కిరణ్‌ల చేతుల మీదుగా కార్మెల కొండవద్ద దివ్యపూజాబలి నిర్వహిస్తామని చెప్పారు. 15 ఉదయం 8గంటలకు కార్మెల్ కొండపై ఫాదర్ పి. జోసఫ్‌బాలసాగర్ దివ్యపూజాబలి నిర్వహిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహిస్తామని వివరించారు. సాయంత్రం దివ్యసత్ప్రసాద ప్రదక్షిణ, ఆరాధన బాల ఏసుదేవాలయం నుంచి కొర్మెల్ కొండ వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొని దివ్య పూజాబలి, అఖండ జపమాల నిర్వహిస్తారని చెప్పారు. 16న ఫాతిమా మర్రెడ్డి, ఫాదర్ ఎం.బాలస్వాముల ఆధ్వర్యంలో సమష్టి దివ్యపూజాబలి నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం పూజ అనంతరం కార్మెల్‌మాత తేరుప్రదక్షిణ నిర్వహిస్తారని వెల్లడించారు. అనంతరం జెండాలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపుగా కొండమెట్ల వరకు వెళ్లి వాటిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ప్రవీణ్, ఫాదర్ పి.థోమాసు, ఫాదర్ విలియం, మఠకన్యలు, గుడిపెద్దలు, సోడాలిటీ సభ్యులు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.